**సమస్యలుంటే సాక్షికి చెప్పండి**

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**98490 98674**

నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### నేడు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక స్పందన

**పెదగంట్యాడ:** మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించనున్నామని తహసీల్దార్ రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వెళ్లి రావడం భారం కావడంతో ఇక్కడ ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకూ ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రజలంతా తమ సమస్యలపై అర్జీలు ఇవ్వొచ్చని తెలిపారు.

### కథలతోనే నీతి బోధన



విద్యార్థులకు కథలు చెబుతున్న శ్రీకాంత్

**పెదగంట్యాడ:** విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తించేవి కథలేనని డి.శ్రీకాంత్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో మంగళవారం కథలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథల్లో నీతి ఉంటుందని, దానిని చెప్పడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో నిజాయితీగా ఉంటారన్నారు. విద్యార్థులు ఆసక్తి కథలు విన్నారు. ఆయా కథల్లోని సారాంశం గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో చందమామ కథలను ఆసక్తిగా చదివేవారమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీ రమణ పాల్గొన్నారు.

### బాక్సింగ్ క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



బాక్సింగ్ క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేస్తున్న శ్రీను

**గాజువాక :** పారిశ్రామిక ప్రాంతానికి చెందిన మైక్ టైసన్ బాక్సింగ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులకు గాజువాక మహాత్మా, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు జాగరపు శ్రీను మంగళవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలని, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు ఎస్‌కే అలీ, గణేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

### బాక్సింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి తదితరులు

**గాజువాక :** బొట్ట శంకర్ మెమోరియల్ ట్రస్టు బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల పోస్టర్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. నిర్వాహకుడు కోటి యాదవ్ మాట్లాడుతూ గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ పోటీలు మహిళలు, పురుషులు, జూనియర్స్, సబ్ జూనియర్స్ కేటగిరీల్లో నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 600 మంది క్రీడాకారులు హాజరు కానున్నట్టు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారుల కోసం నగరంలోని స్వర్ణ భారతి స్టేడియంలో ఎంపికలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ ప్రతినిధులు శంకరరావు, గోగుల లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# గణేష్‌నగర్‌లో సమస్యల తిష్ట

**పేరుకు అది పోష్ కాలనీ. కానీ అక్కడన్నీ సమస్యలే. రోడ్డు నుంచి మురుగు కాలువ వరకు అన్నీ ఇబ్బందులే. తమ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు జీవీఎంసీ అధికారులతో మొరపెట్టుకుంటున్నా పెడచెవిన పెట్టడం తప్ప పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదంటూ కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు.**

- ముళ్లపొదలు, డెబ్రిస్‌తో నిండిపోయిన ప్రధాన రహదారి
- పగిలిపోయి లీకవుతున్న వాటర్ పైప్‌లైన్
- కుక్కలు, పందుల స్వైరవిహారం



గణేష్‌నగర్ ప్రధాన రహదారిలో డెబ్రిస్ పోగులు



పని చేయని మంచినీటి బోరు



నిరంతరం లీకవుతున్న తాగునీటి పైప్‌లైన్

**గాజువాక :** వడ్లపూడి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గణేష్‌నగర్‌లో వివిధ సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. జాతీయ రహదారి నుంచి కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారి ముళ్లపొదలు, డెబ్రిస్‌తో నిండిపోయి ఉంది. కాలనీ మధ్యలో గల మున్సిపల్ వాటర్ పైప్‌లైన్ ఏడాది పొడవునా లీకవుతూనే ఉంటుంది. ఏడాది క్రితం దీనికి మరమ్మతులు చేసినప్పటికీ నీటి లీకేజీని మాత్రం అరికట్టలేకపోయారు. ఇతర ప్రాంతాల్లో మాదిరిగానే ఈ కాలనీ వీధుల్లో కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. వీటికి తోడు పాముల బెడద కూడా తమను ఆందోళనకు గురి చేస్తోందని నివాసులు పేర్కొంటున్నారు. దీంతో చిన్నపిల్లలు వీధుల్లో తిరగలేని పరిస్థితి చోటు చేసుకుంది. ఇటీవల పందులు వీధుల్లోను, వీధి కాలువల్లోను మృతి చెంది దుర్వాసన వెదజల్లుతున్నట్టు ఇక్కడి ప్రజలు పేర్కొంటున్నారు. కాలనీ వీధుల్లోనూ ముళ్లతుప్పలు పెరిగిపోతుండటంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. కాలనీ ప్రవేశం వద్ద గల మంచినీటి బోరు చాలా కాలంగా పని చేయడం లేదని, ఈ విషయాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పరిష్కార చర్యలు చేపట్టలేదని స్థానికులు తెలిపారు. కాలనీకి ఆనుకుని ఉన్న ప్రధాన గెడ్డకు రక్షణ గోడ లేకపోవడంతో జనం ఆందోళన చెందుతున్నారు. ఈ గెడ్డకు ఆనుకుని ఉన్న ప్రధాన రహదారి వడ్లపూడి ప్రధాన రహదారికి అనుసంధానమై ఉంది. దీంతో ఈ రహదారిపై వాహనదారులు, పాదచారులు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తారు. రోడ్డు పక్క నుంచి గల ప్రధాన గెడ్డకు రక్షణ గోడ లేకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతానికి సమీపంలో గల ఆక్సిజన్, ఫార్మా పరిశ్రమల నుంచి వ్యర్థ వాయువులు విడుదలై, వాటిని పీల్చడం వల్ల అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

**అధికారులు స్పందించాలి**

మా కాలనీ సమస్యలపై జీవీఎంసీ అధికారులు స్పందించాలి. ఇక్కడి సమస్యలను అధికారుల దృష్టికి మేము ఎప్పటికప్పుడు తీసుకెళ్తున్నాం. ఏళ్లు దాటిపోతున్నా చర్యలు మాత్రం తీసుకోవడంలేదు. ఇప్పటికైనా మాపట్ల దయ చూపాలి.

– ఎ.సుబ్బరాజు, గణేష్‌నగర్ నివాసి

**చర్యలు తీసుకుంటాం**

గణేష్‌నగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. దీనిపై అన్ని విభాగాల అధికారులను ఆదేశించి పరిష్కరిస్తాం. తక్షణం పరిష్కారమయ్యే సమస్యలను ముందుగా పరిష్కరిస్తాం.

– పి.సింహాచలం, గాజువాక జోనల్ కమిషనర్

# స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

**కూర్మన్నపాలెం :** జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్ చిల్డ్రన్స్ పార్కులో ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ యాంటీ లార్వా ఆపరేషన్, తడి-పొడి చెత్తను వేరు గా అందించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని నియంత్రించవచ్చునని అవగాహన కలిగించారు. ప్రతి మంగళ, శుక్రవారాలు డ్రై డే పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో పాతటైర్లు, వాడి పడేసిన కొబ్బరిబొండాలు, బిరడా లేని సీసాలు ఉంచరాదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, నాగభూషణం, పరమానందయ్య, విశ్వేశ్వరరావు, ఇజ్రాయిల్, గోవిందరావు, ఆడారి శ్రీనివాస్, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో ఆర్థిక వ్యవస్థ కుదేలు



817వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న ఉక్కు కార్మిక కుటుంబాలు

**కూర్మన్నపాలెం :** ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు 817వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఆర్‌ఎంహెచ్‌పీ విభాగం కార్మికులు కుటుంబాలతో సహా పాల్గొన్నా రు. ప్రాణ త్యాగాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే సహించేది లేదన్నారు. దళితులు, బలహీనవర్గాలు,పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతుందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపా యన్నారు. కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై పోటీలు



పోటీల్లో పాల్గొన్న బాలబాలికలు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ పర్యావరణ నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బాలబాలికలకు పర్యావరణ పరిరక్షణపై పోటీలు నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉక్కుక్లబ్ ఎంపీ హాలులో బాలబాలికలకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 'బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్'థీమ్‌తో నిర్వహించిన పోటీల్లో ఉక్కునగరానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు జూన్ 5న జరగనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో పర్యావరణ నిర్వహణ విభాగం అధికారులు పలువురు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక సమస్యలకు చెక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

**పెదగంట్యాడ:** గాజువాక నియోజకవర్గ ప్రజలను దీర్ఘకాలికంగా పట్టి పీడిస్తున్న సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చెప్పారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. హౌస్ కమిటీ సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపించామన్నారు. హౌస్ కమిటీలో ఉన్న భూములకు ఇప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించుకునే వెసులుబాటు కల్పించామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు తప్పుడు పట్టాలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఏపీఐఐసీ కోసం భూముల త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయడానికి రంగం సిద్ధం చేశామన్నారు. జాయింట్ కలెక్టర్‌తో కలిపి ఒక కమిటీ వేశామన్నారు. కమిటీ నివేదిక వచ్చిన తర్వాత వారికి స్థలాలు అందజేస్తామన్నారు. ఫార్మాసిటీ కాలనీల నిర్వాసితులు అయిన మ్యారేజ్ మేజర్ సన్స్ 270 మంది దరఖాస్తులు చేసుకున్నారని, ఒక్కొక్కరికి 144 చదరపు గజాల వంతున స్థలాలను తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేయడానికి సిద్ధం చేశామన్నారు. అగనంపూడి వద్ద గల కర్ణవానిపాలేనికి చెందిన స్టీల్ ప్లాంట్ నిర్వాసితులకు పునరావాసం కింద స్థలాలను అందజేయనున్నామని తెలిపారు. ఆ ప్రాంతంలోనే అక్కడి ప్రభుత్వ భూమిని 119 మంది నిర్వాసితులకు 107 చదరపు గజాల వంతున 115 మందికి పట్టాలు సిద్ధం చేశామన్నారు. మిగిలిన నాలుగు పట్టాలను కూడా త్వరలోనే అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, రాజాన రామారావు, నాయకులు మార్టుపూడి పరదేశి, కోమటి శ్రీనివాసరావు, రాజాన వెంకటరావు, మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### కారుణ్య నియామకాల దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్

**గాజువాక :** జీవీఎంసీ గాజువాక జోన్‌లోని ప్రజారోగ్య విభాగంలో పని చేస్తూ మృతి చెందిన వారి స్థానంలో కొత్తవారి నియామకాలకు సంబంధించిన దరఖాస్తులను గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ మంగళారం పరిశీలించారు. వివిధ వార్డుల్లో శానిటరీ కార్మికులుగా పని చేస్తున్న వారిలో సుమారు 38 మంది మృతి చెందగా, ఆ స్థానాల్లో వారి వారసులను నియమించేందుకు జీవీఎంసీ అధికారులు గతంలోనే దరఖాస్తులు స్వీకరించారు. వాటిని పరిశీలించి రీవెరిఫికేషన్ కోసం వాటిని గాజువాక జోనల్ కార్యాలయానికి సిఫార్సు చేయగా, సహాయ ప్రజారోగ్యాధికారి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులను జోనల్ కార్యాలయానికి పిలిపించి వారి వారసత్వ ధ్రువపత్రాలను పరిశీలించారు. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన తర్వాత వాటిని జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి పంపిస్తామని, అక్కడ ఉన్నతాధికారులు తుది నిర్ణయం తీసుకుంటారని ఏఎంవోహెచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ బీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

### కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

**డాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

**11న సహస్ర తులసిపూజ**

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 11న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

# సుపరిపాలనే సీఎం జగన్ ధ్యేయం



శీలానగర్‌లో మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

**అక్కిరెడ్డిపాలెం:** రాష్ట్రంలో ప్రజలకు నాణ్యమైన పరిపాలన అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. మంగళవారం 69వ వార్డు శీలానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమా న్ని నిర్వహించారు. ముందుగా సుకృతి అపార్ట్‌మెంట్‌లో అపార్ట్‌మెంట్ ప్రతినిధులు రేషన్ కార్డులు, ఆధార్ కార్డు, హౌస్ టాక్స్ వంటి అంశాల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న జగన్ పరిపాలనను చూసి చంద్రబాబు బెంబేలెత్తిపోతున్నారన్నారు. స్థానిక సమస్యలను అక్కడికక్కడే సంబంధిత సచివాలయ కార్యదర్శితో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా ప్రధానకార్యదర్శి, గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్ రెడ్డి, బీసీ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, గంగులూరి రోజారాణి, పెట్ల అప్పారావు, మళ్లా కుమార్, నంది శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె పంపిణీ



కార్మికులకు కొబ్బరినూనె అందజేస్తున్న వంశీరెడ్డి



కార్మికులకు కొబ్బరి నూనె డబ్బాలు అందజేస్తున్న కార్పొరేటర్ చందు

**పెదగంట్యాడ:** పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దళ్లివానిపాలెం శానిటరీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు మంగళవారం కొబ్బరినూనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వార్డులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంలో పారిశుధ్య కార్మికులు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు, రాంబాబు, రామకృష్ణ, మధు పాల్గొన్నారు.

**70వ వార్డులో..**

**గాజువాక :** జీవీఎంసీ 70వ వార్డులో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు మంగళవారం కొబ్బరి నూనె డబ్బాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్త, గార్బేజ్ తరలించడానికి నిరంతరం కృషి చేస్తున్న కార్మికుల ఆరోగ్యమే ప్రధానంగా జీవీఎంసీ ఈ చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ బీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# సృజనాత్మకతకు పదునుపెట్టాలి



నిపమ్ ప్రతినిధి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు

**అగనంపూడి:** విద్యార్థుల్లో మేధో సంపత్తికి నేషనల్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ మిషన్ (నిపమ్) చక్కటి వేదికగా నిలుస్తోందని నిపమ్ ప్రతినిధి మద్దిపాటి శ్రీనివాస్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిపమ్-2, అజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌పై ఆయన మాట్లాడారు. విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, సృజనాత్మక ఆలోచనలు, విద్యార్థుల్లో అంతర్గతంగా ఉన్న మేధోశక్తికి నిపమ్ చక్కటి ఆయుధం అన్నారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు పేటెంట్స్, డిజైన్స్, ట్రేడ్ మార్క్, కాపీరైట్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, సీఈవో శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ పీవీ రవీంద్ర, డీన్‌లు హరగోవిందరావు, ఎస్ఎం కృష్ణ, జీకే పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 135 మందికి ఉచిత కంటి వైద్యసేవలు



కంటి పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది

**అక్కిరెడ్డిపాలెం:** వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం సత్యసాయి భజనమండలి, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సంయుక్తంగా సత్యసాయి మందిరంలో నిర్వహించిన శిబిరంలో 135 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరం అవుతాయని ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ పావని, సిబ్బంది విజయ, భజనమండలి సభ్యులు పులప అప్పారావు, కె.వీర్రాజు, సాయిరాజ్, రమేష్, తారకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐలా పారిశుధ్య కార్మికుల విధుల బహిష్కరణ



ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్దగల ఐలా ఎడ్మినిస్ట్రేటివ్ భవనం వద్ద నిరసన చేపట్టిన ఐలా పారిశుధ్య సిబ్బంది

**అక్కిరెడ్డిపాలెం:** విధులు నిర్వర్తిస్తున్నా పూర్తి స్థాయి లో వేతనాలు చెల్లించడం లేదని, పీఎఫ్ పేరుతో తమకు రోజువారి చెల్లిస్తున్న జీతంలో కోతలు విధిస్తున్నారని ఆటోనగర్ ఐలా మున్సిపల్ సిబ్బంది ఆందోళనకు దిగారు. మంగళవారం ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ఆటోనగర్ ఏపీఐఐసీ ఎడ్మిన్ బిల్డింగ్ వద్ద 80 మంది కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఆటోనగర్‌లో 80 మంది స్వీపర్‌లు 5 ట్రాక్టర్ల ద్వారా నిత్యం మున్సిపల్ పనులు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. తమకు రోజువారి రూ.300 చెల్లిస్తున్నారన్నారు. చెల్లిస్తున్న వేతనంలో రూ.30 కోత విధిస్తూ పీఎఫ్ కటింగ్ అంటున్నారని చెప్పారు. వేతనాలు కూడా 10 రోజులకొకసారి చెల్లిస్తున్నారని అన్నారు. కాంట్రాక్టర్ మారినప్పుడల్లా తమలో కొందరిని విధుల నుంచి తప్పిస్తున్నారని, ఇప్పుడు కోత విధించిన డబ్బుల విషయంలో అయోమయం నెలకొందన్నారు. ప్రస్తుత కాంట్రాక్టర్‌కు సంబంధించి ఇక మూడు నెలలు మాత్రమే పని ఉందని, తర్వాత తమ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమ సమస్యలు పరిష్కరించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై వివరణ తీసుకోవడానికి సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్లో సంప్రదించాలని ఫోన్ చేయగా కాంట్రాక్టర్ స్పందించలేదు.

### నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలి

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ కార్మికుల నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలని గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు కోరారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. సెయిల్‌లో వేతన ఒప్పందం జరిగి ఏడాదిన్నర అవుతున్నా ఇక్కడ అమలు కావడం లేదన్నారు. కార్మికుల వేతన సవరణపై డీపీఈ గైడ్‌లైన్స్ అడ్డంకి అంటూ చెబుతుండటం అన్యాయమన్నారు.దీనిపై శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్టు కార్మికులు తెలిపారు.

### ప్రజాస్వామ్య పరిరక్షణపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రాకేష్ నాయక్

**కూర్మన్నపాలెం :** భారతదేశంలోని ప్రజలందరు సమాన్వతాన్ని పాటించడం, వివక్షను నిర్మూలించడమే మానవ హక్కుల నేర నిరోధక సంఘం ముఖ్య లక్ష్యమని సంఘ చైర్మన్ రాకేష్ నాయక్ అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 86వ వార్డు పరిధి దువ్వాడ సెక్టార్-2లో మంగళవారం రాజ్యాంగ రక్షణ-ప్రజాస్వామ్య పరిరక్షణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుల, మత, వర్ణ వర్గాలకు అతీతంగా సమానత్వం కోసమే ఈ సంస్థ పని చేస్తుందన్నారు. అవినీతి లేని సమాజం రావాలంటే ప్రజలు గొంతు విప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో డబ్బుకు ప్రలోభ పడకుండా నిజాయితీగా ఉండే నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఇందుకూరి నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.



